

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో టోకరా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో ఒంగోలుకు చెందిన అవర్‌జాబ్ సొల్యూషన్ సంస్థ నిర్వాహకుడు మోసం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. - 8లో..



మిరప విత్తనాలు సీజ్

మార్కాపురంలో 4 విత్తనాల దుకాణాలపై సోమవారం సాయంత్రం దర్శి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/30

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జీవన నైపుణ్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ

ఒంగోలు టౌన్: స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు జీవన నైపుణ్యం అనే అంశం మీద ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో ఎంపికైన ఉపాధ్యాయులంతా పాల్గొనాలని ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, ఎస్‌ఈఆర్‌టీ సంయుక్తంగా నిర్వహించనున్న ఈ శిక్షణకు జిల్లాలోని 50 పాఠశాలల నుంచి 100 మంది పీఈటీ, పీడీ, ఉపాధ్యాయులకు మైనంపాడులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థలో తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులను శిక్షణకు హాజరయ్యేందుకు గాను రిలీవ్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలను ఆదేశించారు.

కేంద్ర బడ్జెట్‌లో అంగన్‌వాడీల నిధులపై కోత

ఒంగోలు టౌన్: కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేళ్ల కాలంలో ఐసీడీఎస్ పథకానికి బడ్జెట్లో కోత పెట్టిందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అజయ్ కుమార్ విమర్శించారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద చేపట్టిన 36 గంటల నిరసనలో ఆయన ప్రసంగించారు. వేదాంత ప్రథమ వంటి స్వచ్ఛంద సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించడాన్ని ఆయన ఆక్షేపించారు. వైఎస్సార్ పోషణకు అవసరమైన వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరాఫరా చేయాలని వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కల్పన డిమాండ్ చేశారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి కోరారు. 300 మంది పైగా జనాభా కలిగిన సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్న ఈ నిరసనకు వై.సత్యవతి అధ్యక్షత వహించగా కంకణాల రమాదేవి, కేవీ సుబ్బమ్మ, ప్రశాంతి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మపై పచ్చ విషం



- వాస్తవాలు వక్రీకరిస్తూ కథనం
- అసలు విషయాన్ని దాచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఈనాడులో అసత్య కథనం
- టీడీపీ హయాంలో కనీస మరమ్మతులు చేయని వైనం
- నిర్వహణ నిధులు పక్కదారి
- బ్యూటిఫికేషన్ పేరుతో నిధులు స్వాహా
- ప్రస్తుతం గేట్లు తుప్పు పట్టకుండా ఉండేలా పరీక్షలు
- నివేదిక రాగానే తదుపరి చర్యలు
- రాబోయే 20 ఏళ్లు దృష్టిలో ఉంచుకుని పనులు
- కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు

ఫ్యాక్ట్ చెక్



గుండ్లకమ్మ రిజర్వాయర్ 3వ గేటుకు స్టాప్‌లాక్‌లు అమర్చి ఉన్న దృశ్యం

మద్దిపాడు: జిల్లాలో కీలక సాగునీటి ప్రాజెక్టు కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్‌పై పచ్చ పత్రిక ఈనాడు విషం చిమ్మింది. ఒకప్పుడు కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న జిల్లాలో అన్నదాతలను ఆదుకునేందుకు, ప్రజలకు సాగు, తాగునీరందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. కేవలం నాలుగేళ్లలో డ్యాం నిర్మాణ పనులు పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. 80 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించారు. ఈ ప్రాజెక్టు రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. ఆయన అకాల మరణం తర్వాత వచ్చిన పాలకులు దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. తెలుగుదేశ ప్రభుత్వ చిన్న చూపు చూసింది. కనీసం నిర్వహణ సైతం చేయకపోవడంతో గేట్లు తుప్పు పట్టి పోయాయి. అరకొరగా విదిలించిన నిధులను సైతం సుందరీకరణ పేరుతో దేశం నేతలు స్వాహా చేశారు. నాటి ప్రభుత్వ పాపాల ఫలితంగా గతేడాది ఆగస్టు 31వ తేదీ రాత్రి 3వ నంబరు గేటు కొట్టుకుపోయింది. వెంటనే స్పందించిన అధికారులు స్టాప్ లాక్ పెట్టి నీటి వృథాను అరికట్టారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 20.825 మీటర్ల ఎత్తున 1.80 టీఎంసీల నీరు నిల్వ ఉంచి సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. మరో పక్క భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రానున్న 20 ఏళ్ల పాటు ప్రాజెక్టు పటిష్టంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

గేటు ఊడిపోవడానికి కారణాల అన్వేషణ:

సాధారణంగా 12 ఎంఎం మందం ఉన్న స్టీల్ రేకు తమలపాకులా మారి తుప్పుచేరడానికి గల కారణాలను ఇరిగేషన్ అధికారులు పరిశీలిస్తున్నారు. వాటర్ శ్యాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించి ల్యాబ్ ఎనాలసిస్ వచ్చిన తరువాత తుప్పు రాకుండా చూసుకోవడానికి ఎటువంటి కెమికల్, పెయింట్ వాడాలన్న అంశాలను కూడా ఇంజినీరింగ్ శాఖ పరిశీలిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి అధికారులు తీసుకువెళ్లగా దీర్ఘ కాలం మన్నిక ఉండేలా గేట్లు పెట్టే ప్రక్రియ చేపట్టాలని సూచించడంతో అధికారులు ఆవైపు దృష్టి సారించి ల్యాబ్‌లకు ఎనాలసిస్ చేయడానికి పంపారు. ప్రస్తుతం రిపోర్టులు వచ్చాయి. ఆ నివేదికల ఆధారంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వహణకు ఖర్చు వంటి అంశాలను పొందుపరుస్తూ గతంలో 12 గేట్లకు సంబంధించి రూ.9.4 కోట్లతో చేసిన ప్రతిపాదనల స్థానంలో, 23–24 సంవత్సరం రేట్ల ప్రకారం మళ్లీ తయారు చేసి సీతానగరం వర్క్‌షాపు చీఫ్ ఇంజినీర్‌కు పంపారు. ఈ క్రమంలో రెండు మూడు రోజుల్లోనే పరిపాలనాపరమైన అనుమతుల కోసం ప్రభుత్వం ముందు ఉంచనున్నారని ఉన్నతాధికారులు తెలిపారు.

వాస్తవాల వక్రీకరణ ఇలా..

టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కేవలం రిజర్వాయర్‌కు మొక్కుబడిగా నిధులు ఇచ్చింది. 2013–14 రూ.9.98 లక్షలు, 2014–15 రూ.41.61 లక్షలు, 2015–16 రూ.111.79 లక్షలు, 2016–17 రూ.49.63 లక్షలు నిధులిచ్చింది. వీటిని రిజర్వాయర్ మెయింటెనెన్స్‌కు వినియోగించాల్సి ఉంది. అయితే అప్పటి దేశం నేతలు రిజర్వాయర్ సుందరీకరణ పేరుతో నిధులు మింగేశారు. కనీస మెయింటెనెన్స్ చేయకపోవడంతో రిజర్వాయర్ గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. ఫలితంగా రైతులకు సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. రైతులను ఆదుకునేందుకు దివంగత సీఎం వైఎస్సార్ అన్నిరకాలుగా చర్యలు చేపడితే అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేసిన పచ్చబ్యాచ్ గేట్లు పాడైన అంశంపై ప్రస్తుత ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేసింది. విరిగిపోయిన గేట్లను మరమ్మతులు చేయించడంలేదని, చేసిన పనికి బిల్లులు రావడం లేదని, పనుల కోసం కాంట్రాక్టర్లు సైతం ముందుకు రావడంలేదంటూ విషం చిమ్ముతూ ఈనాడు దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. కనీసం అధికారుల వివరణ సైతం తీసుకోకుండా ప్రభుత్వంపై బురదజల్లుతూ కథనాన్ని ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అడుగులు వేస్తుంటే అసలు విషయాన్ని దాచి వార్తను వండివార్చింది.

1.80ల టీఎంసీ నీరు నిల్వ

ప్రస్తుతం రిజర్వాయర్‌లో 20.825 మీటర్ల ఎత్తున 1.80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రతి ప్రాజెక్ట్‌కు ఒకటే స్టాప్‌లాక్ ఉంటుంది. కానీ గుండ్లకమ్మకు రెండు స్టాప్‌లాక్‌లు ఉన్నాయి. దీంతో రిజర్వాయర్‌లో 1.80 టీఎంసీల నీరు నిల్వ ఉంచి రైతులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. తాగునీటి కోసం రైట్ మెయిన్ కెనాల్ నుంచి బసవన్నపాలెం, నేలటూరు, ఏడుగుండ్లపాడు చెరువులను నీరు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సంవత్సరంలో ఒకసారి ఒక టీఎంసీ నీళ్లు తీసుకువచ్చి నాయకులు హడావుడి చేశారు. అప్పటి సీఎం చంద్రబాబుతో ప్రారంభిస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసే వారు. అప్పటి ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమా సైతం ఇక్కడకు వచ్చారు. ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చాయని, సీఎం వచ్చి వదులుతారని ప్రకటించారు. ఎన్నిసార్లు ఇలా హంగామా చేస్తారని స్థానిక ప్రజలు టీడీపీ నేతలను ప్రశ్నించారు కూడా. ప్రాజెక్టుకు సంబంధించి ఇలా హైడ్రామా జరిగింది. నాడు ఏమీ నోరు మెదపని పచ్చ మీడియా నేడు అభూత కల్పనలు రాస్తోంది. భవిష్యత్‌లో రైతులకు సాగునీటి ముప్పు ఉందని విష ప్రచారానికి తెరతీసింది.

వలంటీర్లు నిస్వార్థంగా సేవ చేస్తున్నారు



మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి, గంగాడ సుజాత, శింగరాజు మీనా వెంకట్రావు

ఒంగోలు సబర్బన్: వలంటీర్లు నిస్వార్థంగా సేవచేస్తున్నారని, అలాంటి వారిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అవాకులు, చవాకులు పేలటం మంచి పద్ధతి కాదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన ఒంగోలు మేయర్ గంగాడ సుజాతతో పాటు పార్టీ నాయకులతో కలిసి సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వలంటీర్లపై పవన్ కళ్యాణ్ అభాండాలు వేయటం సరైన పద్ధతికాదన్నారు. వలంటీర్లు కరోనా సమయంలో చేసిన సేవలు యావత్ దేశంతో పాటు ప్రపంచమే కీర్తించిందని గుర్తు చేశారు. ఒక కుటుంబ సభ్యులుగా వలంటీర్లు పనిచేశారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందించే కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై అభాండాలు వేయటం, అవాకులు, చవాకులు పేలటం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. దమ్ముంటే ప్రజాక్షేత్రంలో గెలిచి ప్రజలకు సేవ చేయాలని పవన్ కళ్యాణ్‌కు హితవు పలికారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మహిళలకు ఎన్ని అన్యాయాలు, అకృత్యాలు జరిగాయి... ఏనాడన్నా మాట్లాడావా అని పవన్ కళ్యాణ్‌ను నిలదీశారు. వలంటీర్ వ్యవస్థను దేశం మొత్తం కీర్తించిందని, అది గుర్తులేదా అని ప్రశ్నించారు. నువ్వు ఎన్ని మాట్లాడినా, అవాకులు, చవాకులు పేలినా వలంటీర్లు ఇష్టపడి, కష్టపడి పనిచేస్తున్నారన్నారు. యువతను, మహిళలను భయభ్రాంతులకు గురిచేయాలని చూడటం మానుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం పవన్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనా కుమారి వెంకట్రావు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, గోలి తిరుపతిరావు, ఘంటా రామానాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- వలంటీర్ల డిమాండ్
- కొవ్వొత్తులతో మానవహారం, జనసేనాని దిష్టిబొమ్మ దహనం
- అనంతరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- మద్దతుగా నిలిచిన కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు



ఒంగోలు చర్చి సెంటర్‌లో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను చెప్పుతో కొడుతున్న వలంటీర్లు

ఒంగోలు అర్బన్: వలంటీర్ వ్యవస్థను కించపరుస్తూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం చర్చి సెంటర్‌లో వలంటీర్లు, నగర కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇతర ప్రజా ప్రతినిధులు కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని నినాదాలు మిన్నంటాయి. అక్కడి నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు సుభాషిణి, గురుదర్శిని, శిరీష ఇతర వలంటీర్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమపై ఎంతో నమ్మకంతో ప్రజా సేవ చేసే అవకాశం ఇచ్చారన్నారు. దీంతో ఎంతో మందికి ప్రభుత్వ పథకాలను ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్నామన్నారు. కరోనా సమయంలో సొంత కుటుంబ సభ్యులే అందించలేని సేవలు వలంటీర్లు అందించారనే విషయం తెలుసుకోవాలన్నారు. అటువంటి వలంటీర్లపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. తాము ఎటువంటి ప్యాకేజీలు తీసుకోవడం లేదని కేవలం ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువగా అందిస్తున్నామని చెప్పారు. వలంటీర్లు కష్టపడి పనిచేసే వ్యక్తులని వారిపై లేనిపోని ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఒక్క ఫోన్‌కాల్‌తో వచ్చి తమకు సాధ్యమైనంత వరకు సహాయం చేస్తారన్నారు. స్వచ్ఛంద సేవకులైన తమపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి వారిని కించపరుస్తూ పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో ప్రతిపక్షాలు దురుద్దేశపూర్వకంగా వ్యవహరించడం హేయమైన చర్య అన్నారు. ప్రతి నెలా వృద్ధులకు పింఛన్లు ఇవ్వడం, కనీసం ఇంటి నుంచి బయటికి రాలేని ఎంతో మందికి నేరుగా వారి ఇంటివద్దకే వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సహాయం చేస్తున్నామని తెలిపారు. పేదలకు సాయం చేస్తున్నామన్న సంతృప్తితో కుల, మత, పార్టీలకు అతీతంగా సేవలందిస్తున్నామని, సామాజిక మాధ్యమాల్లో నిత్యం అందుబాటులో ఉంటూ రానున్న రోజుల్లో కూడా ఈ సేవలను కొనసాగిస్తామన్నారు. సీఎం జగన్‌పై బురద చల్లేందుకు నీతిమాలిన మాటలు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పే వరకు ఊరుకోమని రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు ఉద్యమిస్తారని హెచ్చరించారు. వలంటీర్‌లుగా వేలాది మంది యువతులు ప్రజలకు సేవలందిస్తున్నారని అటువంటి మహిళలపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు సరికాదన్నారు. ఏదైనా వ్యాఖ్యలు చేసేటప్పుడు సరైన రుజువులతో చేయాలని, కేవలం కుట్ర రాజకీయాలు చేయడం కాదన్నారు. దీనిలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, పార్టీ నాయకులు కటారి శంకర్, గంటా రామానాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, దామరాజు క్రాంతికుమార్, బడుగు ఇందిర, కొటారి రామచంద్రరావు, డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొని వలంటీర్లకు మద్దతుగా నిలిచారు.



పోలీస్‌స్టేషన్‌కు నిరసన ప్రదర్శనగా వెళ్తున్న వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు



వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

జవాబుదారీతనంతో జగనన్న పాలన

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: జవాబుదారీతనం, బాధ్యతాయుతంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని, నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా తమ ప్రభుత్వం అన్ని వర్గాల పేద ప్రజలకు చేరవేస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సోమవారం స్థానిక సచివాలయం -4 పరిధిలోని తిరుమలగిరి కాలనీలో ఏర్పాటు చేసిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నామని, దీనిని సహించలేని ప్రతిపక్షాలు ఉచితం పేరుతో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేస్తున్నారని, అప్పులు చేసి పథకాలను అమలు పరుస్తున్నారని గగ్గోలు పెడుతున్నాయని విమర్శించారు. 2024లో జరిగే ఎన్నికల్లో టీడీపీని రూపురేఖలు లేకుండా చేస్తారని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు 99.5 శాతం అమలు పరిచారని, మిగిలిన 5 శాతం కూడా పూర్తి చేయటానికి జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమం అందిస్తున్న నాయకుడు జగనన్నను మరోసారి దీవిద్దామని, రాష్ట్రాభివృద్ధికి పాటుపడే జగనన్ననే తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సుబ్బారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, నాయకులు ఎం.ఆదిశేషు, ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఎం.కరీముల్లాబేగ్, ఎం.వెంకటరెడ్డి, బి.బాలచెన్నయ్య, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయి కుమార్, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖర రెడ్డి, ఏఈలు ఆర్.వి.సుబ్బయ్య, టి.అల్లూరయ్య, అంజిరెడ్డి, ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లునాయక్ పాల్గొన్నారు.

మహిళలంటే గౌరవం లేని మూర్ఖుడు పవన్‌కళ్యాణ్

యర్రగొండపాలెం: మహిళలంటే గౌరవంలేని మూర్ఖుడు, వివాహ వ్యవస్థకు భిన్న భాష్యంచెప్పు గౌరవంలేని వ్యక్తి జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ అని, మహిళల పట్ల నీచంగా మాట్లాడి కించపరుస్తున్న ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పవన్ కళ్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనంతో వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారని, కోవిడ్ సమయంలో తమ ప్రాణాలను పణంగాపెట్టి ప్రజలకు అండగా నిలిచారని, అటువంటి వారిపై నిందలు మోపడం హేయమైన చర్య అన్నారు. పవన్ కళ్యాణ్ పిచ్చిపట్టిన వాడిలా తన ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఇటువంటి పరిస్థితుల్లో మహిళలు ఏ విధంగా వారిని క్షమిస్తారని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ మాటలను బట్టిచూస్తే బాబు స్క్రిప్టును ఫాలో అవుతున్నాడని అర్థమవుతోందన్నారు.

బాధితులకు సంపూర్ణ న్యాయం చేసేందుకే స్పందన

- కలెక్టర్ దినేష్ కుమార్
- ప్రత్యేక స్పందనలో 445 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, వేదిక పై ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, జేసీ

కనిగిరి రూరల్: బాధితులకు సంపూర్ణ న్యాయం చేసేందుకు కనిగిరి నియోజకవర్గంలో ప్రత్యేక స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమం నిర్వహించినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక పవిత్ర కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ స్పందనలో ఇచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సాధ్యమైనంత వరకు సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఒక వేళ సమస్య పరిష్కారం కాక పోతే ఎందువల్ల కాలేదనేది అర్జీదారునికి లిఖిత పూర్వకంగా వివరించాలని తెలిపారు. వివిధ మండలాల నుంచి సుమారు 444 అర్జీలు వచ్చాయని, అందులో ఎక్కువ భాగం రెవెన్యూ, పింఛన్ సమస్యలు ఉన్నాయన్నారు. అభివృద్ధికి సంబంధిత అంశాలు కూడా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఖోఖో క్రీడాకారులు ఆటలు ఆడేందుకు స్థలాన్ని కేటాయించాలని విన్నవించగా తక్షణం సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని ఆర్డీఓ అజయ్‌కుమార్‌ను ఆదేశించారు. పలువురు వికలాంగులు ట్రై సైకిల్స్‌కు విన్నవించగా, తక్షణం మంజూరు చేయాలని సంబంధిత శాఖ పీడీకి ఆదేశించారు. ఇలా అనేక సమస్యలు అక్కడికక్కడే తక్షణ పరిష్కారంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిని సారించడాన్ని కొనియాడారు. అధికారులు నియోజకవర్గంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కలెక్టర్ చేపడుతున్న ప్రత్యేక స్పందన కార్యక్రమం వల్ల ప్రభుత్వానికి ఎంతో మంచి పేరు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జేసీ కే శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, గంగసాని లక్ష్మి, గాయం సావిత్రి, ఎం వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మేకల శ్రీను, ఆర్డీఓ టీ అజయ్‌కుమార్, పీడీలు తేళ్ల రవికుమార్, మాధురి, డీటీసీ ఆర్ సుశీల, ఎంపీఐ రవి కుమార్, తహసీల్దార్ యూ పుల్లారావు, డీసీహెచ్ ఎస్ఎన్ మూర్తి, కమిషనర్ డీవీ ఎస్ నారాయణ, జేడీ బేబి రాణి, హౌసింగ్ పీడీ పేరయ్య, పీఆర్ ఎస్ఈ కే కొండయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎస్‌కే మర్దన్‌అలీ, ఎస్ఈలు, ఈఈలు, డీఈలు ఆదిశేషు, కోటిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు బాధాకరం

- ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

సింగరాయకొండ: గ్రామ వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు బాధాకరమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. స్థానిక సాంఘిక గురుకుల పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీకి వచ్చి అనంతరం విలేకరులతో మాట్లాడారు. కరోనా సమయంలో వలంటీర్లు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల క్షేమ సమాచారం తెలుసుకునేందుకు ఇంటింటికీ వెళ్లి కరోనా బాధితులకు అండగా నిలబడ్డారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేస్తూ వృద్ధులు, వికలాంగులకు చేదోడు వాదోడుగా ఉంటున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటికే వచ్చేలా వలంటీర్లు నిత్యం ఎంతో శ్రమిస్తున్నారన్నారు. కరోనా సమయంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియదు గానీ, ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు వలంటీర్లపై ఆరోపణలు చేయడం ఏంటని ప్రశ్నించారు. సెంట్రల్ ఇంటెలిజెన్స్ వారు తనకు స్వయంగా చెప్పారని పవన్‌కళ్యాణ్ అనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని విమర్శలు చేసినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆపే శక్తి ఎవరికీ లేదన్నారు. మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

క్లుప్తంగా

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురం: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పట్టణానికి చెందిన బి.శంకర్‌రెడ్డి (45)కి మరికొంతమందితో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. వీటి విషయమై ఇటీవల గొడవలు జరుగుతున్న నేపథ్యంలో తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని భావిస్తూ సోమవారం పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే గుర్తించి పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. టూటౌన్ ఎస్సై సువర్ణ మృతుని కుటుంబసభ్యుల నుంచి వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైల్వేట్రాక్ పక్కన మృతదేహం లభ్యం


జితేందర్ సింగ్ మృతదేహం

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లె పంచాయతీ పరిధిలోని సంగపేట గ్రామంలోని వెలిగొండ ప్రాజెక్టు నీటి కాలువ సమీపంలో రైల్వే ట్రాక్ వెంబడి మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే.. జార్ఖండ్ నుంచి రైల్వే పనులు చేసేందుకు వచ్చిన జితేందర్ సింగ్ అనే వ్యక్తి మద్యం సేవించి నూతనంగా వేస్తున్న డబుల్ రైల్వేలైన్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తలకు తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణపావని సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వీఆర్‌ఓ యోన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.12.45 లక్షల విలువైన మిరప విత్తనాలు సీజ్


రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

మార్కాపురం: పట్టణంలో 4 విత్తనాల దుకాణాలపై సోమవారం సాయంత్రం దర్శి వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విత్తన కంపెనీల అనుమతిపత్రాలు లేకుండా విక్రయానికి సిద్ధంగా ఉన్న 26 కేజీల హైబ్రిడ్ మిరప విత్తనాలను సీజ్ చేసినట్లు దొనకొండ ఏఓ లక్ష్మీనారాయణ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12.45 లక్షలు ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా విత్తనాలు ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి బిల్లులు తీసుకోవాలని ఆయన కోరారు.

వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్‌గా మాగులూరి


మాగులూరి నాగేశ్వరరావు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్‌గా ఒంగోలుకు చెందిన మాగులూరి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగిన వినియోగదారుల సదస్సులో నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా సమాఖ్య ప్రజా సంబంధాల అధికారిగా సింగరి నాగమయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ఉద్యమాన్ని గ్రామీణ స్థాయికి తీసుకువెళ్లేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్లను వినియోగదారుల వ్యవహారాలకు సంబంధించి నోడల్ అధికారులుగా నియమించినందున వారితో సంప్రదించి గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, ప్రభుత్వ పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేసి చిన్నతనం నుంచే వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తామన్నారు.


పెద్దదోర్నాలలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు


పొన్నలూరులో పవన్‌కళ్యాణ్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు


సంతనూతలపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్‌లు

పవన్‌కళ్యాణ్‌పై భగ్గుమన్న వలంటీర్లు

- పలుచోట్ల పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మలు దహనం
- నల్లబ్యాడ్జీలతో నిరసన
- పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు

మార్కాపురం:

జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు నీతిబాహ్యమైనవని, ఒంటరి మహిళలు, వితంతువుల వివరాలు సేకరించి సంఘ విద్రోహ శక్తులకు సమాచారమిస్తున్నారంటూ తమ మనోభావాలను దెబ్బతీశారని జిల్లాలోని వలంటీర్లు నిప్పులు చెరిగారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో మానవహారంగా ఏర్పడి పవన్ వ్యాఖ్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. ర్యాలీలు నిర్వహించి, పవన్‌కల్యాణ్ దిష్టి బొమ్మలు దహనం చేశారు.

■ ఉమన్ ట్రాఫికింగ్ చేస్తున్నామంటూ తమపై ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని మార్కాపురం పట్టణ వలంటీర్లు సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రతి నెలా 1వ తేదీన ఇంటింటికీ వెళ్లి పింఛన్ ఇవ్వడంతోపాటు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న తమపై పవన్ అనుచితంగా మాట్లాడటం తగదన్నారు. ఆయన దగ్గర ఉన్న ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశఋారు. కార్యక్రమంలో వలంటీర్లు డి.ఖాశీం, యూ శ్రీనివాసులు, ఎస్‌కే ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

పవన్ క్షమాపణ చెప్పాలి

తర్లుపాడు: ఒంటరి మహిళలు, వితంతువుల వివరాలు సేకరించి సంఘ విద్రోహ శక్తులకు సమాచారమిస్తున్నారన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై మండలంలోని పోతలపాడు సచివాలయం వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కల్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలియచేశారు. కార్యక్రమంలో జె.గురవయ్య, ఆర్.సురేష్, ఎస్.మీరావలి, ఎస్.రవితేజ, సీహెచ్ రామాంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

■ చీమకుర్తి: వలంటీర్లను కించపరుస్తూ మాట్లాడిన పవన్ కల్యాణ క్షమాపణలు చెప్పాలని సంతనూతలపాడు వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం సంతనూతలపాడులోని 1, 2 సచివాలయాల పరిధిలోని వలంటీర్లు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండించారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్‌లను పవన్ కల్యాణ్ దారుణంగా మాట్లడటం తగదని హెచ్చరించారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. వలంటీర్లకు సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, మద్దులూరు సర్పంచ్ బీ.శైలజ సంఘీభావం తెలిపారు.

పవన్‌వి దిగజారుడు మాటలు

పొన్నలూరు: గ్రామ వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ చేస్తున్న దిగజారుడు మాటలు మానుకోవాలని వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు పిల్లిపోగు జీవన్‌కుమార్ హితవుపలికారు. ఆదివారం ఏలూరులో పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా పొన్నలూరులో సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వలంటీర్లపై ఇష్టానుసారంగా నిరాధారమైన ఆరోపణలు చేసిన పవన్‌కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం పవన్‌కళ్యాణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్సై రాజారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌కే గౌస్‌బాషా, ఎం జక్రయ్య, రాజు, నాగేంద్రబాబు, చిన్న, మోషే తదితరులు పాల్గొన్నారు.

■ పెద్దదోర్నాల: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తమకు వెంటనే క్షమాపణ చెప్పాలంటూ మండటంలోని వలంటీర్లు నల్ల బ్యాడ్జీలతో సోమవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని మహిళా వలంటీర్లు కొడుతూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పవన్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సై అంకమరావుకు ఫిర్యాదు చేశారు.

కొత్తపట్నంలో మానవహారం, ర్యాలీ

కొత్తపట్నం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని కొత్తపట్నంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం నుంచి నినాదాలు చేస్తూ బస్టాండ్ కూడలికి చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. వలంటీర్లకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి సంఘీభావం తెలిపారు. పవన్ కళ్యాణ్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, వలంటీర్లకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతూ పిచ్చివాడిలా మాట్లాడటం మంచి పద్ధతి కాదని మండిపడ్డారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓ పి.సుజాతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు, తాతా శ్రీను, నాంచార్లు, తుమ్మ పుల్లయ్య, బాబు, కోడూరి వెంకారెడ్డి, వాలింటీర్లు రవి, వెంకటేశ్వర్లు, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పే వరకు నిరసన తెలపండి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ ఆరపణలు చేయటం సిగ్గుచేటని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. సోమవారం చీమకుర్తి మండలం తొర్రగుడిపాడులో జగనన్న సురక్ష కార్యక్రమంలో పవన్ వ్యాఖ్యలపై స్పందించారు. కరోనా సమయంలో పవన్ కల్యాణ్, చంద్రబాబు హైదరాబాద్‌లోని ఇళ్లలో కూర్చుంటే, వలంటీర్లు తమ ప్రాణాలను సైతం లెక్క చేయండా కరోనా బాధితుల ఇళ్లకు వెళ్లి నిర్భయంగా సేవలందించారని గుర్తు చేశారు. అలాంటి వలంటీర్లపై పవన్ కళ్యాణ్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం దారుణమన్నారు. పవన్ కల్యాణ్‌కు బుద్ధి వచ్చి క్షమాపణ చెప్పే వరకు నిరసన తెలపాలని వలంటీర్లకు పిలుపునిచ్చారు.


మార్కాపురంలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు


తర్లుపాడులో పవన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు


కొత్తపట్నంలో ర్యాలీలో పాల్గొన్న వలంటీర్లు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో టోకరా

ఒంగోలు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో ఒంగోలుకు చెందిన అవర్ జాబ్ సొల్యూషన్ అనే సంస్థ నిర్వాహకుడు వంశీకృష్ణ రూ. 2 లక్షలు తీసుకొని మోసం చేశాడని బేస్తవారిపేటకు చెందిన టి.రమణారెడ్డి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ మలికగర్గ్‌కు ఫిర్యాదు చేశారు. తన బావమరిదికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలకడంతో రూ.2 లక్షలు ఇచ్చామని, నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ లేఖ ఇచ్చి మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పుడు తాము ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వమని అడుగుతుంటే సమాధానం చెప్పడం లేదని వాపోయారు.

■ సింగరాయకొండలోని శ్రీలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన రవిచంద్ర కుమార్ తమకు తెలియకుండా తమ ధ్రువీకరణ పత్రాలతో ఫైనాన్స్‌లో టీవీ కొన్నాడని, ఇప్పుడు ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఈఎంఐ కట్టమని తమను వేధిస్తున్నారని అదే గ్రామానికి చెందిన పి.సుబ్రమణ్యం ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. స్పందనకు మొత్తం 96 ఫిర్యాదులు రాగా వాటిపై స్పందించిన ఎస్పీ వెంటనే ఆయా పోలీసుస్టేషన్లకు ఫోన్ చేసి మాట్లాడారు. స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఒంగోలు సబ్‌డివిజన్ డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


స్పందనలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

జగనన్న కలలు సాకారం


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున

సింగరాయకొండ: విద్యా వ్యవస్థను మెరుగుపరచాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కన్న కలలు సాకారమవుతున్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. ఇంగ్లిష్‌లో విద్యార్థినులు మాట్లాడుతుంటే ముచ్చటేస్తోందని చెప్పారు. తిరుపతి నుంచి విజయవాడ వెళ్తున్న ఆయన సింగరాయకొండలోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ సరదాగా మాట్లాడారు. పాఠశాలలో వసతులు, భోజనం గురించి 5, 8వ తరగతి విద్యార్థినులను ప్రశ్నించగా అంతా బాగుందని చెప్పడంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఓ విద్యార్థినికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పడంతోపాటు పలువురికి ఆటోగ్రాఫ్ ఇచ్చారు. పాఠశాలలో సైన్సు గ్రూప్ ఏర్పాటు చేస్తామని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు బదులిచ్చారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఎస్సై టి.శ్రీరామ్, ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఒంగోలు టౌన్: ప్రేమించి పెళ్లి చేసుకున్న తమను కుటుంబసభ్యులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, చంపుతామని బెదిరిస్తున్నారని పుల్లలచెరువుకు చెందిన ప్రేమజంట పోలీసులను రక్షణ కోరారు. పుల్లలచెరువు గ్రామానికి చెందిన దేశావత్ రూపాబాయి, పవన్ కుమార్‌లు సోమవారం ఎస్పీ కార్యాలయంలో స్పందనలో పోలీసు అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాకు వివరాలను వెల్లడించారు. దేశావత్ రూపాబాయి గుంటూరులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమెకు అదే గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌తో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకోవాలనుకున్న వీరిద్దరూ ఈ విషయాన్ని ఇళ్లల్లో పెద్దలకు తెలియజేశారు. ఈపెళ్లికి పవన్ కుటుంబ సభ్యులు అంగీకరించగా రూప కుటుంబసభ్యులు ఒప్పుకోలేదు. దీంతో నాలుగు నెలల క్రితం గుడిలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం ఇంట్లో విషయం చెప్పగా..తల్లిదండ్రులు మేం చూసిన సంబంధమే చేసుకోవాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారు. గర్భిణి అయిన రూపను సంధ్యాలలోని బంధువుల ఇంటికి తీసుకెళ్లి బలవంతంగా సంతకాలు చేయించి అబార్షన్ చేయించారు. మరో పెళ్లికి ఏర్పాటు చేస్తుండటంతో ఈ నెల 9న పెద్దలకు తెలియకుండా ఇంటి నుంచి వచ్చేశారు. మాకు రక్షణ కల్పించాలని, తన మీద దాడి చేసిన తల్లిదండ్రులు, మావయ్య, అమ్మమ్మలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.


పోలీసులను కలిసిన ప్రేమజంట

ఆయుర్వేద వైద్యసేవలు అందుబాటులో..

ఒంగోలు అర్బన్: జిల్లా కేంద్రంలో ఆయుర్వేద వైద్య సేవలు అన్ని వేళల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకునానమని ఆయుష్ శాఖ ఆర్‌డీడీ డాక్టర్ పద్మజాతి తెలిపారు. సోమవారం ఒంగోలులోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఆయుర్వేద, యునాని, హోమియో విభాగాలను ఆమె సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయుర్వేద విభాగంలో వైద్యురాలు సెలవుపై ఉండటంతో ఓపీలు చూసి వైద్య సేవలు అందించారు. వైద్యులు భీమనాథ్, రాజ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ సీసీఎఫ్ పర్యటన

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీ శాఖ పరిధిలో రాష్ట్ర ప్రిన్సిపల్ సీసీఎఫ్ వై. మధుసూదనరెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో లైలాగ్రూపు చైర్మన్, మాజీ ఎంపీపీ గోకరాజు గంగరాజు బహూకరించిన నూతన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని దిగువమెట్ట అటవీ ప్రాంతంలో ఏకో టూరిజం అభివృద్ధి పనులు పరిశీలించారు. నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం పరిసర అటవీ ప్రాంతాలను పరిశీలించారు. డిప్యూటీ డైరెక్టర్ వై.నరసింహారావు, రేంజ్ ఆఫీసర్లు కుమార్‌రాజ, జీవన్, సౌజన్య, డీఆర్‌ఓ వంశీక్రిష్ణ, ఎఫ్‌ఎస్‌ఓలు, ఎఫ్‌బీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న పి సీసీఎఫ్

స్పందన అర్జీలు సత్వరమే పరిష్కారం

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్పందన భవనంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ)లు వరకుమార్, కే చెన్నయ్య, ఉమాదేవి, లోకేశ్వరరావు నిర్వహించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ కనిగిరి నియోజకవర్గంలో స్పందన నిర్వహించగా కలెక్టరేట్‌లో ఎస్‌డీసీలు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తెలుసుకున్న సమస్యలను సంబంధిత శాఖల ఉద్యోగులు వెంటనే పరిష్కరించాలని సూచించారు.

- పొన్నలూరు మండలం రావులకొల్లు గ్రామానికి చెందిన పీ రమణయ్య స్పందనలో అధికారులను కలిసి మాదిగ పల్లెకు పంచాయతీరాజ్ శాఖ బోరు వేసి మోటరు, పైపులు బిగించి పల్లెకు నీరు సరఫరా చేశారని తెలిపారు. అయితే పల్లె పక్కనే ఒక ప్రైవేటు వ్యక్తి ఆ నీటి పైపులైనును తన సొంత పొలానికి, వాటర్ ప్లాంట్‌కు వినియోగిస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. దీంతో పల్లెలోని ప్రజలకు నీటి ఇబ్బందులు ఉన్నాయని, వాటర్ ప్లాంట్‌ను తొలగించి పల్లె కోసం ఏర్పాటు చేసిన పైపు లైను ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని తెలుపుతూ అర్జీ అందచేశారు.
- సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామానికి చెందిన గోగుల నరసింహారావు స్పందనలో అధికారులను కలిసి తన తండ్రి పేరు తమ హౌస్‌హోల్డ్ లిస్టు నుంచి మరొకరి లిస్టులోకి జంప్ అయిందని తెలుపుతూ అర్జీ అందజేశాడు. దీంతో గత నెల వరకు తమ రేషన్ కార్డులో ఉన్న పేరు ఇప్పుడు లేకుండా పోయిందని తెలిపారు. పరిశీలించి పేరును తిరిగి తమ హౌస్‌హోల్డ్ లిస్టులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరాడు.
- కొత్తపట్నం మండలం మోటుమాల శివారు బీరంగుంట గ్రామానికి చెందిన శంకరమ్మ స్పందనలో అధికారులను కలిసి గృహ నిర్మాణానికి సంబంధించి ఒక్క బిల్లు కూడా ఇప్పటి వరకు రాలేదని తెలుపుతూ అర్జీ అందచేసింది. అప్పుచేసి ఇంటి నిర్మాణం చేస్తున్నానని ఇప్పటికి కేవలం సిమెంట్, ఐరన్ మాత్రమే ఇచ్చారు కానీ ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు మాత్రం చెల్లించలేదని పరిశీలించి బిల్లులు మంజూరు చేయించాలని కోరింది.
- సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామానికి చెందిన కుంచాల సూర్యనారాయణ స్పందనలో అధికారులను కలిసి తనకు వ్యవసాయ భూమి ఇవ్వాలని కోరుతూ అర్జీ అందచేశాడు. పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నానని వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నానని పరిశీలించి కొంత ప్రభుత్వ భూమిని వ్యవసాయానికి కేటాయించి ఇప్పించాలని కోరాడు.